బైబిలు యొక్క గొప్ప బోధలు

# క్రీస్తు ఎందుకు వచ్చినట్టు

క్రీస్తు తరచుగా వ్యతిరేక వాచకాలను ఉపయోగించి బోధించారు – అంటే సత్యం కానిది ఏదో వివరించేవాడు. అసత్య బోధలు, అభిప్రాయాలు అనేవాటిచేత తబ్బిబ్బు పడకుండ ఉండేలా జనులు వాటిని గురించి తెలుసుకోవాలని ఆయన నమ్మినట్టున్నారు. ఆయన భూమిమీదికి రావడాన్ని గూర్చి ప్రభువైన యేసు యొక్క బోధలో అలాటి కొన్ని వ్యాఖ్యలను కనుగొంటాం. ఈ "వ్యతిరేకతలు" ఆయన ఎందుకు వచ్చాడు అనే సత్యాన్ని తేల్చడానికి సహాయపడతాయి.

## తీర్పు తీర్చడానికి కాదు, గాని లోకాన్ని రక్షించడానికే ఆయన వచ్చాడు

యోహాను 3:17లో యేసు ఇలా చెప్పాడు, "లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు." యేసు యెరూషలేము వెళ్లనభిముఖుడైనందున ఒక సందర్భంలో, కొందరు సమరయులలో వారు ఆయనను చేర్చుకొననందుకు ఆకాశమునుండి అగ్ని దిగివచ్చి వారిని కాల్చివేయాలని, యాకోబు, యోహానులు అభిప్రాయం కలిగియున్నారు. అప్పుడు ఆయన వారిని గద్దించి – "మనుష్యకుమారుడు మనుష్యుల ఆత్మలను రక్షించుటకే గాని నశింపజేయుటకు రాలేదనెను" (లూకా 9:56).

దేవుని సంకల్పమును, ఆయన కోర్కెయు లోకాన్ని రక్షించడమే గాని, దాన్ని నాశనం చేయడం కాదు. పాపిని శిక్షించడానికి ఆయన త్వరపడడం లేదు; "అందరును మారుమనస్సు పొందవలెనని" ఆయన కోరుతున్నాడు (2 పేతురు 3:9). నిర్దయాత్మకమైన ఏకాధిపతియై మనిషిని కనిపెట్టుతూ, తప్పును కనుగొనడానికి ఆతురత పడుతున్నవాడైనట్టు కొందరు దేవుని చిత్రించారు కాని, లేఖనాల్లో చిత్రింపబడిన దృశ్యం అది కాదు. నీనెవె వారిని నాశనం చేయలేదని యోనా దేవుని మీద వ్యసనపడినప్పుడు, అలాటి తత్వమున్నందుకే దేవుడతని గద్దించాడు, "అయితే నూట ఇరువది వేలకంటె ఎక్కువై, కుడియెడమలు ఎరుగని జనమును … గల నీనెవె మహాపురము విషయములో నేను విచారపడవద్దా?" అని (ఆయన) యోనాకు సెలవిచ్చెను (యోనా 4:11). మనుష్యులు రక్షింపబడక పోయినప్పుడు దేవుడు సంతాపపడ్డాడు. ఆయన ఉద్దేశము రక్షించడమే.

అప్పుడు, క్రీస్తు యొక్క తొలిరాక రక్షించడానికే, తీర్పు తీర్చడానికి కాదు.

## ధర్మశాస్త్రమును ప్రవక్తల వచనములను కొట్టివేయుటకు కాదు నెరవేర్చుటకే ఆయన వచ్చాడు

తన అనుచరులతో యేసు యిలా తెలిపాడు, "ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు" (మత్తయి 5:17). "... ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పి పోదని" (మత్తయి 5:18) ఆయన ప్రకటించాడు. దానిలోని ప్రతి భాగము నెరవేరువరకు ధర్మశాస్త్రము తొలిగిపోకూడదు.

ఈ వాక్య భాగాన్ని పట్టుకొని పాత నిబంధన యింకా నిలిచియుందని కొందరు చెప్పుకొనడానికి ఉపయోగిస్తుండగా, ఇది కేవలం దానికి వ్యతిరేకమైన దాన్ని బోధిస్తుంది. ధర్మశాస్త్రము నైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయడానికి క్రీస్తు ప్రభువు రాలేదు, కాని వాటిని నెరవేర్చడానికే. ఆయన వాటిని నెరవేర్చాడు. ఆయన ప్రవచనాలను నెరవేర్చాడు, మరియు ధర్మశాస్త్రం యొక్క ఆజ్ఞల మేరకు కావలసిన ప్రతి దానిని ఆయన జీవించడం ద్వారా నెరవేర్చాడు. మోషే ద్వారా అనుగ్రహింపబడిన ధర్మశాస్త్రం నెరవేర్చబడింది, అది యిక మీదట అమలులో లేదు అనే విషయం యితర లేఖన భాగాలు కూడా స్పష్టంగా బోధిస్తున్నాయి (హెబ్రీ. 10:9, 10; కొలస్సీ. 2:14; గలతీ. 3:24, 25లను చదువు).

రూపాంతరం కూడా యిదే సత్యాన్ని బోధిస్తుంది. మోషే ఏలీయాల సమక్షంలో, దేవుడు యేసును గూర్చి మాట్లాడుతూ, "ఈయన మాట వినుడి"! అని చెప్పాడు (మత్తయి 17:5). అధికార స్వరంగా జనులు మోషే యొక్కయు, ప్రవక్తల యొక్కయు మాట విన్న సమయం ఉండింది, అయితే యిప్పుడు గుర్తింపబడిన ప్రమాణంగా క్రీస్తు ప్రభువు మాటయే వినాలి.

## పరిచారము చేయించుకొనుటకు కాదుగాని పరిచారము చేయుటకు వచ్చెను

(ప్రభువైన) యేసు యిలా అన్నాడు, "ఆలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకును వచ్చెనని చెప్పెను" (మత్తయి 20:28). ఆయన కావాలని కోరుకొంటే అనేకమంది పరిచారకులను, పరలోక సంబంధమైన పరిచారకులను సహితం పిలుచుకోగలవాడే. భూలోక, పరలోక సంబంధమైన ఆధారాలు తన స్వాధీనంలో ఉన్నాయి, కాని ఆయన పరిచర్య చేయించుకొనడానికి రాలేదే!

నిజమైన గొప్పతనాన్ని గూర్చిన ప్రభువు పాఠాన్ని జ్ఞాపకం చేసికొందాం. "మీలో అందరికంటే గొప్పవాడు మీ పరిచారకుడై యుండవలెను" (మత్తయి 23:11). ఈ పాఠాన్ని నొక్కి చెప్పడానికీ, మాదిరిగా నిలపడానికినీ తువ్వాలును నడుమునకు కట్టుకొని, దీనుడై పరిచారము చేయబూని ఆయన తన అపొస్తలుల కాళ్లు కడిగాడు (యోహాను 13:5).

తమ జీవితంలో అత్యధికమైన గురి సేవ చేయించుకొనడమే అనే జనులతో లోకము నేడు నింపబడినట్టుంది. తమతో కలిసియున్న వారి వద్దనుండి, ప్రభుత్వంనుండి, సంఘంనుండి, యింకా ఏ మార్గంనుండియైనా ఎల్లప్పుడు పొందే దృష్టిలోను ఉంటారు. స్థానిక సంఘంలోని సభ్యులు కూడా తమకు పరిచర్య చేయబడడం లేదని ఫిర్యాదు చేసేవారు ఉన్నారు. పరిచర్య చేయబడాలనేది మన జీవితపు ఉద్దేశమై యుండకూడదు. మన పని పరిచర్య చేయడమే. క్రీస్తు ప్రభువు తిరిగి వచ్చి తువ్వాలును నడుమునకు కట్టుకొని, మన పాదాలు కడగాలని మనం వేచియున్నామా? మన మధ్య ఒక చిన్న బిడ్డను నిలబెట్టి నిజమైన గొప్పతనమేదో అనే పాఠం మనకు నేర్పించాలా? ఈ పాఠాలు ఆయన ముందుగానే నేర్పించాడు; వాటినుండి మనం నేర్చుకొందాం.

## నీతిమంతులను కాక, పాపులను ఆయన పిలువ వచ్చాడు

ఒక సందర్భంలో తన శిష్యులను యేసు యిలా సవాలు చేశాడు: "అయితే నేను పాపులను పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువ రాలేదు. గనుక – కనికరమునే కోరుచున్నాను గాని బలిని కోరను అను వాక్య భావమేమిటో వెళ్లి నేర్చుకొనుడని చెప్పెను" (మత్తయి 9:13). పాపులతో కూడ ఆయన భోజనము చేయుచున్నాడని విమర్శింపబడగా, ఆయన వారికి ఈ జవాబు యిచ్చాడు: "– రోగులకే గాని ఆరోగ్యముగల వారికి వైద్యుడక్కరలేదు గదా" (మత్తయి 9:12).

ఇతరులచే తృణీకరింపబడిన వారియెడల యేసు శ్రద్ధ చూపాడు. యేసే మెస్సీయా అనే అభయం యోహానుకు అవసరమైనప్పుడు, "గ్రుడ్డివారు చూపు పొందుచున్నారు, కుంటివారు నడచుచున్నారు, కుష్ఠరోగులు శుద్ధులగుచున్నారు, చెవిటివారు వినుచున్నారు, చనిపోయినవారు లేపబడుచున్నారు, బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది" యోహానుకు తెలుపునట్లు అతని వర్తమానికులకు బోధింపబడింది (మత్తయి 11:5). మెస్సీయా వచ్చి ఏమి చేస్తాడని చెప్పబడిందో (యెషయా 61:1), వాటినే యేసు చేస్తున్నందున ఆయనయే క్రీస్తు అయ్యున్నట్టు యోహానుకు స్థిరపరచబడుతుంది. అవును, యితరులచేత తృణీకరింప బడిన వారి యొద్దకు యేసు వెళ్లాడు. వారికి సహాయం చేయడానికే తప్ప దుష్ట సాంగత్యము చేయడాన్ని ఈ మాదిరి సమర్థించదు.

## సమాధానము పంపుటకు కాదు, ఖడ్గము వేయుటకే ఆయన వచ్చాడు

ప్రేమ, సమాధానాలను గూర్చి ప్రభువు మాట్లాడినా, ఆయన యిలా ప్రకటించాడు, "నేను భూమిమీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు" (మత్తయి 10:34). ఏ బాంధవ్యం కంటెను మతాన్ని పైగా ఉంచాలి. దుష్టత్వం విస్తరించేకొలది విభజన అవసరమైయుంటుంది. ఎంత ఖరీదైనా క్రైస్తవుడు సర్దుకుపోతాడని కాదు – సత్యాన్ని వ్యయపరచి సమాధానంగా ఉండడం కాదు. అది విరోధాన్ని తెచ్చినా, సత్యాన్నే మనం కోరుకోవాలి. స్నేహితులను కోల్పోవలసివచ్చినా, క్రీస్తును వెంబడించడానికే మనం తీర్మానించుకోవాలి. ఈ భావంతో,

ఆయన ఖడ్గాన్ని తెచ్చాడు:

> ఒక మనుష్యునికిని వాని తండ్రికిని, కుమార్తెకును, ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. ఒక మనుష్యుని యింటివారే అతనికి శత్రువుల గుదురు.
>
> తండ్రినైనను తల్లినైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; కుమారునినైనను, కుమార్తె నైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు (మత్తయి 10:35-37).

దేహ సంబంధులైన కుటుంబ సభ్యులకు క్రీస్తుకు మధ్య కోరుకోవలసిన అవసరత ఏర్పడినప్పుడు, మనం క్రీస్తునే కోరుకోవాలి. ఆయనకంటే ఎక్కువగా తల్లినో తండ్రినో, సోదరునో సోదరినో లేక యింకా ఏ వ్యక్తినో ఎక్కువగా ప్రేమించినట్టయితే మాత్రం మనం ఆయన శిష్యులమై యుండలేం. యేసు క్రీస్తు ప్రథమ స్థానాన్ని కోరుతున్నాడు. ఆయన నిజంగా ప్రభువే అయ్యుంటే, ఆయన అందరికి పైగా ప్రభువైయుండాలి.

## ముగింపు

ఆయన ఎందుకు వచ్చాడో దానిని నీవు అర్థం చేసికొన్నావా? దేవుడు కోరిన విధంగా నీవు జీవిస్తున్నావా?

### దేవుని వాక్యాన్ని ధ్యానించే సమయాలు

యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించువాడు ధన్యుడు (కీర్తన. 1:1-3). మొదటి కీర్తన ప్రకారం, దేవుని వాక్యాన్ని ధ్యానించువాడు "ధన్యుడు" లేక ఆనందించువాడై యున్నాడు. దుష్టులు ఆలాగున నుండరు అని 4వ వచనం బయలుపరచింది. నీతిమంతుడు లేఖనాలను ఆలోచించేదెప్పుడు?

**పగటియందు ధ్యానించు.** మనం దేవుని వాక్యమందు ఆనందించువారమైతే, మన దినచర్య సమయాల్లోను, మన వ్యాపారపు రద్దీలోను అది మన హృదయపు పనియై ఉంటుంది. క్రైస్తవుని మనస్సు దేవుని వాక్యముచేత పూర్తిగా నిమగ్నమై ఉంటుంది; అన్ని వేళ్లలా దానిని ఉపయోగించుకోవచ్చు (కీర్తన. 119:11).

**రాత్రియందు ధ్యానించు.** మనం విశ్రమించే సమయాల్లోను, దాన్ని గూర్చి మనం ఆలోచింపవచ్చు. తన విశ్రమ కాలంలో ఉండే ఆలోచనలే ఒక వ్యక్తి యొక్క మహా గొప్ప పరీక్షలైయుంటాయి.

**ఆరాధనయందు ధ్యానించు.** ఆరాధన కార్యక్రమంలో, మనం పాడేటప్పుడు, ప్రార్థించేటప్పుడు, మనం దేవుని వాక్యం మీద ధ్యానం కలిగియుంటామా? ప్రభురాత్రి భోజనంలో పాలుపొందే సమయంలో మన మనస్సు సిలువ వద్దకు చేరుతుందా? అది వ్యక్తం చేయడానికి ముందు ఆరాధన హృదయంలో ఉండాలి.